సాక్షి ఖమ్మం

బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



ఎన్నాళ్లో వేచిన ఉదయం!

మధిరలో కోర్టు భవనాల నిర్మాణానికి రూ.24కోట్ల నిధులు మంజూరు కావడంతో ఏళ్ల నాటి కల ఫలించినట్లయింది. 8లో



సార్లు వస్తున్నారని...

సత్తుపల్లి మండలంలోని సింగరేణి ప్రాంతాల్లో పర్యావరణ అధికారులు తనిఖీకి రావడంతో సంస్థ ఉద్యోగులు జాగ్రత్త వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 20°

వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థులకు అందజేసే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.ఏ.మహమూదీ తెలిపారు. 2023 విద్యాసంవత్సరం(పాల్ సీజన్)కు గాను ఇంజనీరింగ్‌లో 60 శాతం మార్కులు ఉండి పీజీ చేసేందుకు, పీజీలో 60 శాతం మార్కులు వచ్చి డాక్టరేట్ చేయాలనుకునే వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. విదేశాల్లోని యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు మార్చి 20వ తేదీలోగా తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక, దరఖాస్తు ప్రతులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన ఎంపీడీఓలు



ఎంపీడీఓలతో మాట్లాడుతున్న కమల్‌రాజ్

ఖమ్మంవన్‌టౌన్: ఇటీవల ఇతర జిల్లాల నుండి బదిలీపై వచ్చి వివిధ మండలాల్లో బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు మంగళవారం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంలోని జెడ్పీ కార్యాలయంలో వారు చైర్మన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాలు లేనందున ప్రజలకు ఇబ్బంది ఎదురుకాకుండా పర్యవేక్షిస్తూ, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషిచేయాలని సూచించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మాస్టర్ ట్రెయినర్ శ్రీరామ్

ఖమ్మం సహకారనగర్: అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకొని ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని మాస్టర్ ట్రెయినర్లు కొండపల్లి శ్రీరామ్, మదన్‌గోపాల్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం తహసీల్దార్లు, సెక్టార్ అధికారులకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వగా పోలింగ్, పోలింగ్ యంత్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం ట్రెయినర్లు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని, విధుల్లో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించేలా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అలాగే, నివేదికలు నిర్ణీత సమయంలోగా సమర్పించాలని సూచించారు. ఈసమావేశంలో నోడల్ అధికారి, డీపీఓ విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీలో రష్యా బృందం



జేవీఆర్ ఓసీలో జీఎంతో రష్యా బృందం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీలో రష్యాకు చెందిన మల్టీ నేషనల్ ఎనర్జీ కార్పొరేషన్ సంస్థ సభ్యులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా జేవీఆర్ ఓపెన్ కాస్ట్‌ను సందర్శించిన వారు ఇక్కడ ఉపయోగించే షావెల్స్‌ను పరిశీలించడంతో పాటు డంపర్లు పనిచేసేందుకు డీజిల్ బదులుగా లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్(ఎల్ఎన్‌జీ)ని వినియోగానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు, అధికారులు పాల్గొన్నారు.

కమనీయం.. రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భయం.. భయం

శిథిల భవనాల్లో వసతిపై ఆందోళన

- అన్ని ప్రభుత్వ సంక్షేమ శాఖ హాస్టళ్లలోనూ ఇదే పరిస్థితి
- ఏళ్లుగా మరమ్మతుల కోసం ఎదురుచూపులు
- తల్లిదండ్రుల ఆందోళనను పట్టించుకోని యంత్రాంగం
- కొన్నింటికి నిధులు విడుదలైనా టెండర్లు, పనుల్లో జాప్యం





శిథిలావస్థకు చేరిన పెనుబల్లి బీసీ సంక్షేమ శాఖ వసతి గృహం (ఇన్‌సెట్) కూలేందుకు సిద్ధంగా ఉన్న హాస్టల్ గోడ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శిథిల భవనాలు భయపెడుతున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరి ఆందోళనకరంగా మారినా మరమ్మతులపై ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ పాత భవనం కూలిన విషయం విదితమే. ఈ నేపథ్యాన హాస్టళ్లలో ఉంటున్న పిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన మరింత పెరుగుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పలు వసతిగృహాల భవనాలు శిథిలావస్థకు చేరగా.. పైకప్పు పెచ్చులు ఊడిపోవడంతోపాటు కిటికీలు, తలుపులు ధ్వంసమయ్యాయి. ఇకనైనా భవనాల మరమ్మతులపై దృష్టి సారించకపోతే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు వస్తున్నాయి.

నిధుల లేమి

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు నిధులు లేకపోవడంతో పరిస్థితి నానాటికీ ప్రమాదకరంగా మారుతోంది. కొన్నిచోట్ల ఎలాగోలా నెట్టుకొస్తున్నా ఇంకొన్ని భవనాల్లో హాస్టళ్ల నిర్వహణ సాధ్యం కాక అద్దె భవనాల్లోకి మారుస్తున్నారు. రూ.వేలల్లో నిధులు వెచ్చిస్తే మరమ్మతులు చేసే అవకాశమున్నా రూ.లక్షల అద్దె చెల్లిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాల మరమ్మతులకు రూ.2.37 కోట్ల నిధులను ఆ శాఖ కేటాయించినా వివిధ కారణాలతో పనులు ప్రారంభించలేదు. బడ్జెట్ ఫ్రీజింగ్‌లో ఉండడంతో పనులకు టెండర్లు వేసేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. కొన్నింటికి మరమ్మతులు చేసినా, ఇంకొన్ని వదిలేశారనే విమర్శలున్నాయి. ఇక బీసీ సంక్షేమ శాఖ నుంచి ఒక్కో వసతి గృహానికి రూ.50 వేలు విడుదల చేసినా ఆ నిధులు ఎటూ చాలక పనులు పూర్తికాలేదు.

బీసీ వసతిగృహాలకు ఓకే..

జిల్లాలోని బీసీ సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. ఏ వసతిగృహం ఎంత మేర శిథిలమైంది, మరమ్మతులకు ఎంత నిధులు కావాలనే నివేదికలు సమర్పించగా, 18 వసతిగృహాలకు రూ.3.79 కోట్లు నిధులు కేటాయించారు. ఇందులో అత్యధికంగా కూసుమంచి బాలుర హాస్టల్‌కు రూ.32లక్షలు కేటాయించగా, మధిర బాలుర, ఖమ్మం బాలుర 'బీ' హాస్టళ్లకు రూ.27లక్షల చొప్పున, కిష్టారం బాలుర, తిరుమలాయపాలెం బాలికల హాస్టల్‌కు రూ.26 లక్షల నిధులు కేటాయించారు. అలాగే, బాలుర హాస్టళ్లలో ఖమ్మం 'ఏ', సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, చిన్నకోరుకొండి, అడసర్లపాడు, వి.వెంకటాయపాలెంతో పాటు బాలికల హాస్టళ్లలో ఖమ్మం, నేలకొండపల్లి, మధిర తదితర హాస్టళ్లతో పాటు ఖమ్మం బాలికల కళాశాల, పాలేరు బాలికల కళాశాల హాస్టల్ భవనాలకు నిధులు వెచ్చించనున్నారు. ఇక సాంఘిక సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు సైతం భవనాల మరమ్మతులకు టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నారు. కనీసం వచ్చే విద్యాసంవత్సరం నాటికైనా భవనాలను పూర్తి స్థాయిలో మరమ్మతు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిథిలావస్థలో..

జిల్లాలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన 51, బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 33 వసతిగృహాలతో పాటు గిరిజన వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు 33 ఉన్నాయి. వీటిలో కొన్ని ప్రభుత్వ భవనాల్లో, మరికొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే, ప్రభుత్వ భవనాలు చాలావరకు శిథిలావస్థకు చేరగా, ఆయా శాఖల నుండి సరైన సమయంలో నిధులు రాక మరమ్మతులు సాధ్యం కావడం లేదు. ఫలితంగా కొన్ని హాస్టళ్లను అద్దె భవనాల్లోకి మార్చారు.

- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న బనిగండ్లపాడు, వీవీ పాలెం, ఖమ్మం-ఏ, పెనుబల్లి, తిరుమలాయపాలెం, సత్తుపల్లి వసతి గృహాల్లో కొన్ని పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా శిథిలమయ్యాయి. ఇంకొన్ని వసతిగృహాల్లో సగం గదులను కూల్చివేయాల్సిన పరిస్థితి ఉంది.
- గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి వల్లభి, సుబ్లేడు, తిమ్మారావుపేట వసతిగృహాలతో పాటు ఖమ్మం ముస్తఫానగర్‌లో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల పరిస్థితి ఇలానే ఉంది.
- ఎస్సీ వసతిగృహాల్లో మీనవోలు, సత్తుపల్లి బాలికల వసతిగృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరగా.. మీనవోలు బాలిక వసతిగృహంలో నాలుగు గదులను కూల్చివేయాల్సిన స్థితికి చేరాయి. ముచ్చెర, కల్లూరు బాలుర వసతిగృహాల్లో డైనింగ్ హాళ్లు శిథిలావస్థలో చేరినట్లు విద్యార్థులు చెబుతున్నారు.

మరమ్మతులకు నిధులు కేటాయించారు..



జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించాం. కొన్ని వసతి గృహాలు శిథిలావస్థకు చేరినట్లు గుర్తించగా, మరమ్మతులకు కలెక్టర్ గౌతమ్ నిధులు కేటాయించారు. త్వరలోనే టెండర్లను పిలిచి పనులు చేయిస్తాం. మిగతా హాస్టళ్లలో కూడా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం.

– జి.జ్యోతి, బీసీ అభివృద్ధి శాఖ అధికారి

టెండర్లకు ముందుకు రావడం లేదు..



ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టళ్లలో సమస్యలను గుర్తించి కొన్నిచోట్ల మరమ్మతులు చేయించాం. ఇంకొన్ని భవనాలకు సంబంధించి పనులు పూర్తి చేసేందుకు టెండర్లు పిలిచాం. కానీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. వసతిగృహానికి రూ.5లక్షల చొప్పున నిధులు ఉన్నందున మరోసారి టెండర్లు ఆహ్వానిస్తాం.

– కస్తాల సత్యనారాయణ, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ

గొర్రెల పథకం.. అక్రమాల పుట్ట

- రూ.17కోట్ల మేర అక్రమాలపై 'కాగ్' నివేదిక
- జిల్లాలో 27 మంది పశువైద్యాధికారులకు నోటీసులు
- వారంలోగా సమాధానం ఇవ్వకపోతే నిధుల రికవరీ



గొర్రెల మంద

ఖమ్మంవ్యవసాయం: గొర్రెల పథకం నిర్వహణలో అక్రమాలు భారీగా జరిగినట్లు 'కాగ్' నివేదిక ఆధారంగా బయటపడింది. గొర్రెల పంపిణీ పథకాన్ని అమలుచేసే క్రమంలో అవకతవకలు జరిగాయని, తప్పుడు నివేదికలతో అక్రమాలకు పాల్పడ్డారని కాగ్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలోని ఏడు జిల్లాలో అక్రమాలు జరగగా, జాబితాలో ఖమ్మం జిల్లా కూడా ఉంది. 2017–18 సంవత్సరంలో జరిగిన అక్రమాల వెనుక 27 మంది పశువైద్యాధికారుల హస్తం ఉన్నట్లు తేలడంతో వారికి మంగళవారం సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. ఈ అంశంపై వారం రోజుల్లోగా సరైన సమాధానం ఇవ్వని పక్షంలో నగదు రికవరీ చేస్తామని అందులో పేర్కొన్నారు.

గొర్రెల రవాణా, ఇతర అంశాల్లో..

ప్రభుత్వం గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధి కోసం 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఒక్కో యూనిట్‌లో రూ.1.25లక్షల విలువైన 21 గొర్రెలు అందించనుండగా, 75 శాతం ప్రభుత్వ వాటా కాగా, లబ్ధిదారులు రూ.31,250 చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద జిల్లాలో 32,513 మందిని అర్హులుగా గుర్తించగా, తొలిదశలో 16,324 యూనిట్లు అందజేయాలని నిర్ణయించారు. ఈమేరకు 2017–18లో 10,538 మందికి గొర్రెలు అందించగా, 970 యూనిట్లకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు కాగ్ గుర్తించింది. రూ.17 కోట్ల మేర నిధుల దుర్వినియోగం జరిగినట్లు నివేదికలో పేర్కొంది. ఒక్కో యూనిట్ రవాణాకు సుమారు రూ.6 వేల ధర నిర్ణయించడంతో ప్రకాశం, చిత్తూరు, కడప జిల్లాల్లో గొర్రెలు కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు బిల్లులు సమర్పించారు. అయితే, కాంట్రాక్టర్లు ఇచ్చిన రవాణా వాహన వివరాలను కాగ్ పరిశీలిస్తే అంబులెన్స్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఉండగా, రికార్డుల్లో అంకెల మార్పిడిని కూడా గుర్తించారు.

ఆ తప్పిదాలను మాపై రుద్దొద్దు

గొర్రెల పథకంలో కాంట్రాక్టర్లు, రవాణాదారులు చేసిన తప్పిదాలను తమపై రుద్దటం సరికాదని పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. గొర్రెల రవాణాలో వినియోగించిన వాహనాల నంబర్లను నివేదికల్లో పొందుపర్చగా, అవి కాకుండా రవాణాదారులు ఇచ్చిన వాహన నంబర్లను పరిగణనలోకి తీసుకొని తమను బాధ్యులను చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గొర్రెల రవాణాలో జరిగిన అక్రమాలు, బిల్లుల చెల్లింపుల్లో తమకెలాంటి సంబంధం లేనందున చర్యలు తీసుకోవాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

27 మంది పశువైద్యాధికారులకు నోటీసులు



కాగ్ నివేదిక ఆధారంగా జిల్లాలో 27 మంది పశువైద్యాధికారులకు నోటీసులు జారీ చేశాం. గొర్రెల పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని కాగ్ పేర్కొంది. నోటీసులకు పశువైద్యాధికారులు వారంలోగాసమాధానం ఇవ్వాలి. లేనిపక్షంలో వారి నుంచి నిధులు రికవరీ చేస్తాం.

– బి.వేణుమనోహర్‌రావు, జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ

క్రమశిక్షణ, శారీరక దృఢత్వమే కీలకం



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖ ఉద్యోగులు క్రమశిక్షణ, శారీరక దృఢత్వం కలిగి ఉండడమే కీలకమని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. తెలంగాణ పోలీస్ నియామక మండలి ద్వారా ఎంపికై తొమ్మిది నెలల శిక్షణకు వెళ్తున్న 158మంది సివిల్, ఏఆర్ స్టైఫండరీ ట్రెయినీ కానిస్టేబుళ్లకు మంగళవారం ఖమ్మంలో సీపీ గుర్తింపు కార్డులు, కిట్లు అందజేసి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు సేవలందించేలా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ తొలినాళ్లలో కుటుంబసభ్యులను గుర్తుచేసుకుంటూ భావోద్వేగాలకు గురి కాకుండా మానసిక స్థైర్యంతో మెలగాలని తెలిపారు. కాగా, ఖమ్మం కమిషనరేట్ పరిధి నుంచి పురుషుల్లో 54మంది సివిల్, 55మంది ఆర్మ్‌డ్, మహిళల్లో 33మంది సివిల్, 16మంది ఏఆర్ అభ్యర్థులు రాష్ట్ర పోలీస్ అకాడమీతో పాటు వరంగల్ పీటీసీ, సైబరాబాద్ సీటీసీ, ఎనిమిదో బెటాలియన్‌లో శిక్షణకు బయలుదేరారు. ఈకార్యక్రమంలో సీసీఆర్‌బీ ఏసీపీ గణేష్, ఏఓ అక్తరున్నీసాబేగం, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, అప్పల నాయుడు, సీఐలు అంజలి, స్వామి, వెంకన్న, సూపరింటెండెంట్ జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి విక్రయాల్లో అయోమయం



రైతులతో మాట్లాడుతున్న ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మిర్చి విక్రయాల సందర్భంగా అయోమయం నెలకొంది. మార్కెట్‌కు సోమవారం భారీగా మిర్చి రావడంతో రాత్రి వరకు కాంటాలు, రవాణా పూర్తికాలేదు. దీంతో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు మంగళవారం కొనుగోళ్లకు విరామం ప్రకటించినా, మార్కెట్ కమిటీ అధికారికంగా వెల్లడించలేదు. వ్యాపారులు మాత్రం సోషల్ మీడియాలో మంగళవారం మిర్చి కొనుగోళ్లు ఉండవంటూ ప్రచారం చేశారు. అయినా పలువురు రైతులు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు మార్కెట్‌కు మిర్చితో చేరుకున్నారు. సుమారు 5వేల బస్తాలకు పైగా మిర్చి తీసుకొచ్చినా కొనుగోళ్లు లేకపోవటంతో రైతులు అయోమయానికి గురయ్యారు. ఈమేరకు అధికారులను కలిసి విన్నవించగా.. ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ వ్యాపారులతో చర్చించి పంట కొనుగోలు చేయించారు. ఈమేరకు మిర్చి ధర క్వింటాకు గరిష్టంగా రూ.20,800, తాలు మిర్చి రూ.12వేలుగా నమోదైంది.

మార్కెట్‌కు మేడారం సెలవులు

మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు గురు, శుక్రవారం సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అయితే, మిర్చి సీజన్ కావడంతో శనివారం వారాంతపు సెలవైనా పంట కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు. ఈమేరకు రైతులు గమనించాలని కోరారు.

వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్‌గా సైదబాబు



చైర్మన్ సైదబాబును అభినందిస్తున్న మంత్రి తుమ్మల, నాయకులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని వీ.వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా అల్లీపురానికి చెందిన రావూరి సైదబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో చైర్మన్‌గా ఉన్న కూరాకుల నాగభూషణంపై డైరెక్టర్లు ప్రవేశపెనట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన విషయం విదితమే. ఈమేరకు జిల్లా సహకార అధికారి మురళీధర్ ఆధ్వర్యాన మంగళవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికకు 13మంది డైరెక్టర్లలో పది మంది హాజరయ్యారు. చైర్మన్‌గా సైదబాబు నామినేషన్ దాఖలు చేయగా, వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాస్, జోగి అనిత బలపరిచారు. మిగతా డైరెక్టర్లు ఆమోదించడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం కాగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు నాయకులు సాధు రమేష్‌రెడ్డి, పోట్ల వీరేందర్, చావా నారాయణరావు, మిక్కిలినేని నరేందర్, నల్లమల వెంకటేశ్వరరావు, సంక్రాంతి నాగేశ్వరరావు, సామినేని రాంబాబు, ముప్పారపు ఉపేందర్ రావు, పోట్ల వీరేందర్, గుర్రం రవీందర్, రాంబాబు, పత్తిపాటి వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు. ఎన్నిక సందర్భంగా పీఏసీఎస్ వద్ద రఘునాథపాలెం సీఐ తుమ్మలపల్లి శ్రీహరి ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు.

దాతలే దిగి రావాలి..

- ఆకలితో ఎస్సెస్సీ విద్యార్థుల ఇక్కట్లు
- ఖాళీ కడుపులతోనే ప్రత్యేక తరగతులకు..
- అల్పాహారానికి నిధులు మంజూరు చేయని ప్రభుత్వం
- కొన్ని చోట్ల దాతలు, ఉపాధ్యాయుల చేయూతతో నిర్వహణ



నాగులవంచ పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్న ఉపాధ్యాయుడు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని తపన పడుతుంటారు. అయితే, ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని పదేపదే సమీక్షల్లో సూచించే ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉత్తీర్ణత శాతం పెరిగేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నా అల్పాహారం మాత్రం అందించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాకపోవడంతో కొన్ని చోట్ల హెచ్‌ఎంలు దాతల చేయూతతో విద్యార్థులకు స్నాక్స్ సమకూరుస్తున్నా, మిగతా చోట్ల మాత్రం నకనకలాడే కడుపుతోనే చదువుకోవాల్సి వస్తోంది.

సాయంత్రం ఆరు గంటల వరకు...

గతేడాది జిల్లాలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత 88.72శాతం నమోదుకాగా, ఈసారి మరింత పెంచాలని కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలల్లోని 10,146 మంది పదో తరగతి చదువుతుండగా, మూడు నెలలుగా పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8–30నుంచి 9–30వరకు, సాయంత్రం 4–45నుంచి 5–45గంటల వరకు ఈ తరగతులు కొనసాగుతున్నాయి. అయితే, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఉదయం టిఫిన్ చేసే పరిస్థితి లేకపోగా, మధ్యాహ్నం భోజనం వరకు అలాగే ఉంటున్నారు. అనంతరం సాయంత్రం ఆరు గంటల వరకు పాఠశాలలో ఉండి ఇంటికి వెళ్లే వరకు ఏం తినే పరిస్థితి లేక ఆకలితో గడపాల్సి రావడం తల్లిదండ్రులను ఆవేదనకు గురిచేస్తోంది. ఈ పరిస్థితులతో అనేక మంది విద్యార్థులు చదువుపై ధ్యాస సారించకలేకపోతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

గతంలో విద్యార్థికి రూ.15

గతంలో సైతం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించగా, స్నాక్స్ సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున నిధులు విడుదల చేసింది. కానీ ఈసారి ఆ ఊసే లేకపోవడంతో దాతల కోసం ప్రధానోపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని సుమారు వంద పాఠశాలల్లో దాతల సహకారంతో అల్పాహారం అందుతున్నట్లు సమాచారం. మిగతా చోట్ల ఆ పరిస్థితి లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకొస్తున్నా ఎన్నిరోజులు కొనసాగించగలరనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇకనైనా విద్యాశాఖ చొరవ తీసుకొని ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం అందించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

నిధులు రాలేదు



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. హెచ్‌ఎంలు దాతల సహకారంతో విద్యార్థులకు వీలైనంత వరకు అల్పాహారం అందేలా చూస్తున్నారు. జిల్లాలోని సుమారు 100పాఠశాలల్లో అల్పాహారం అందుతోంది.

– ఈ.సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

దాతల సహకారంతో అల్పాహారం



గ్రామానికి చెందిన వంకాయలపాటి సత్యనారాయణ సహకారంతో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాం. సాయంత్రం వరకు విద్యార్థులు పాఠశాలలోనే ఉంటుండడంతో నీరసపడతారని దాత ముందుకొచ్చారు. ఇంకా ఒకరిద్దరు కూడా సహకరిస్తామని చెప్పారు.

– కనపర్తి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, నాగులవంచ

ఇబ్బందిగానే ఉంటోంది..



మా పాఠశాలలో అల్పాహారం ఇంకా ప్రారంభం కాలేదు. మేం ఇంటి నుంచి ఏదో ఒకటి తెచ్చుకొని తింటున్నాం. అయినా సాయంత్రం తరగతులు పూర్తయి ఇంటికెళ్లే వరకు ఆకలితో ఉండడం కష్టంగానే ఉంటోంది. అల్పాహారం అందిస్తే మాలాంటి విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది.

– వి.ఈశ్వర్‌తేజ, ఎన్నెస్పీ కాలనీ హైస్కూల్

దాతలతో పాటు మేం కూడా..



పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించాలని కృషి చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించకపోవడంతో దాతలను సంప్రదించాం. కొద్దిమంది హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సహకారంతో చాలా పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాం.

– ఆర్.వీరస్వామి, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

ఎంపీ రవిచంద్రను సత్కరించిన సండ్ర



ఎంపీ రవిచంద్రను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి/రఘునాథపాలెం: రాజ్యసభకు రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో మంగళవారం కలిసిన సండ్ర ఆయనను సత్కరించారు. ఈకార్యక్రమంలో పసుమర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఎంపీ రవిచంద్రను రఘునాథపాలెం మండల నాయకులుమాధంశెట్టి హరిప్రసాద్, తోట వెంకట్, నున్నా శ్రీను, చెరుకూరి బిక్షమయ్య తదితరులు కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు



ఏలూరిని సన్మానిస్తున్న టీజీవోస్ జిల్లా బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు ఎన్నిక కాగా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మంగళవారం హైదరాబాద్‌లో శ్రీనివాసరావును కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేష్, వాసిరెడ్డి శ్రీనివాస్, హరికిషన్, నయీంపాషా, సతీష్, సుధారాణి, మంజుల, ప్రసన్నకుమార్, అశోక్‌రెడ్డి, వీరస్వామి, కనపర్తి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, టీఎన్జీవోస్ నాయకులు కొణిదన శ్రీనివాస్, పొట్టపింజర రామయ్య, గంగవరపు బాలకృష్ణ, జైపాల్, కొమరగిరి దుర్గాప్రసాద్, గుంటుపల్లి శ్రీనివాస్, యర్రా రమేష్, రమణయాదవ్, రామకృష్ణ, కోనార్ తదితరులు కూడా ఏలూరి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాశాఖలో కీలకంగా సీఆర్పీలు



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ శర్మ, సీఆర్పీలు

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలో సీఆర్పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్)ల విధులు కీలకంగా నిలుస్తున్నాయని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. సమగ్ర శిక్షా అభియాన్‌కు చెందిన సీఆర్పీలు రూపొందించిన డైరీని మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాలలకు సంబంధించి నివేదికల రూపకల్పన, బడి బయటి పిల్లల గుర్తింపు, పాఠశాలల్లో చేర్పించడంలో సీఆర్పీలు కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అనంతరం సీఆర్పీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్ పాషా, అశోక్ పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవికుమార్, ఉద్యోగులు శ్రీధర్‌బాబు, జీఎస్.ప్రసాద్‌తో పాటు సీఆర్పీలు భగవాన్, వీరయ్య, మైసయ్య, లత, రవి బాబు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్‌కు బెయిల్ నిరాకరణ

ఖమ్మం లీగల్: ఆలయ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వి తరలించారనే కేసులో రిమాండ్‌లో ఉన్న కూసుమంచి మండలం గోపాలరావుపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌కు బెయిల్ లభించలేదు. ఆయన తరఫున ఖమ్మం జిల్లా కోర్టులో బెయిల్ పిటీషన్ దాఖలు చేయగా, మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న జిల్లా ప్రధాన న్యాయాధికారి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ పిటీషన్‌ను తిరస్కరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.శంకర్ వాదనలు వినిపించారు.

మండ్రాజుపల్లి కొత్తూరులో చోరీ

నేలకొండపల్లి: మండలంలోని మండ్రాజుపల్లి కొత్తూరులో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బొజ్జా రామారావు కుటుంబీకులు మంగళవారం ఉదయం బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపును రాడ్‌తో పగలగొట్టి బీరువాలో దాచిన రూ.70వేల నగదు దొంగిలించారు. రామారావు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి చోరీ జరిగిందని గుర్తించి నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

ఎన్నాళ్లో వేచిన ఉదయం!

- మధిరలో తీరనున్న కోర్టు భవనాల సమస్య
- భవనాల నిర్మాణాలకు రూ.24 కోట్ల నిధులు మంజూరు
- ప్రస్తుతం పశువుల దవాఖానాలో కొనసాగుతున్న కోర్టు



శిథిలావస్థకు చేరిన పాత కోర్టు భవనం

మధిర: శతాబ్ద కాలం క్రితం నిర్మించిన మధిర కోర్టు భవనం శిథిలావస్థకు చేరింది. 1930లో నిర్మించిన భవనంలో నిజాం కాలంలో కోర్టును ప్రారంభించగా.. ఇది శిథిలావస్థకు చేరి స్లాబ్ కురిసి ఫైళ్లు పాడవుతుండడంతో తాత్కాలికంగా కోర్టును పశువుల దవాఖానాలోకి మార్చారు. ఆతర్వాత నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు కాకపోవడంతో ఆ సమస్య అలాగే ఉండిపోయింది. రెండున్నరేళ్లుగా పశువుల ఆస్పత్రిలోనే కోర్టు కొనసాగుతుండగా... ఇరుకు గదుల్లో ఉద్యోగులు, న్యాయవాదులు విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. అయితే, మధిర ఎమ్మెల్యేగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క ప్రస్తుత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉండడంతో కోర్టు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం లభించినట్లయింది.

ఎన్నికల సమయాన పరిశీలన

గత ఎన్నికల ఎన్నికల సమయాన నాటి మధిర ఎమ్మెల్యే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాత కోర్టు భవనాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన భవనం మొత్తాన్ని తొలగించి నూతన భవనం నిర్మిస్తే అన్ని కోర్టులకు సౌకర్యంగా ఉంటుందని న్యాయవాదులు చెప్పడంతో ఆయన కూడా అంగీకరించారు. అంతేకాకుండా బార్ అసోసియేషన్‌కు హాల్, కక్షిదారులకు విశ్రాంతిభవనం, పార్కింగ్ వంటి అధునాతన సౌకర్యాలతో విశాలమైన ఆవరణలో కోర్టు నిర్మించాలనే నిర్ణయానికి వచ్చారు. అయితే, గత ప్రభుత్వ హయాంలోనే కోర్టు భవన నిర్మాణానికి రూ.21 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపించినా అనుమతి రాలేదు. నాలుగోసారి మధిర ఎమ్మెల్యేగా గెలిచిన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యాన మధిర కోర్టు భవన సముదాయ నిర్మాణానికి పరిపాలనా అనుమతులతో రూ.24 కోట్లు నిధులు మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగు కోర్టులు

మధిరలోని పశువుల దవాఖానాలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి కోర్టులు కొనసాగుతున్నాయి. ఇటీవల మధిరకు సబ్ కోర్టు(సీనియర్ సివిల్ జడ్జి కోర్టు) కూడా మంజూరైంది. కానీ నిర్వహణకు భవనం లేదు. ఇటీవల జిల్లా న్యాయమూర్తి వచ్చి సబ్ కోర్టు నిర్వహణకు సమీపంలో సమీకృత మార్కెట్ భవనం, వ్యవసాయ మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న రైతు విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. తాత్కాలికంగా కొనసాగుతున్న కోర్టుకు ఆనుకుని ఉన్న సమీకృత మార్కెట్‌లో సబ్ కోర్టు నిర్వహిస్తే కక్షిదారులు, న్యాయవాదులకు సౌకర్యంగా ఉంటుందని న్యాయవాదులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈవిషయంలో ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఇంతలోనే కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యాన... పాత కోర్టు ఆవరణలో ఉన్న సబ్ జైల్‌ను సైతం తొలగించి పక్కా ప్రణాళికతో భవన సముదాయాన్ని నిర్మిస్తే అన్ని కోర్టుల నిర్వహణకు అనుకూలంగా ఉంటాయనే భావన వ్యక్తమవుతోంది.



పాతకోర్టు భవనం వద్ద న్యాయవాదులతో భట్టి విక్రమార్క (ఫైల్)

భట్టికి కృతజ్ఞతలు



పాత కోర్టు భవనం శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. అప్పటినుంచి తాత్కాలికంగా పశువుల దవాఖానాలో కోర్టు కొనసాగుతోంది. సమస్యను భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా అధికారంలోకి రాగానే నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. – వాసంశెట్టి కోటేశ్వరరావు, న్యాయవాది, కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్

సమస్య తీరింది



కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో కొన్నేళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైనట్లయింది. భవన నిర్మాణం కూడా వెంటనే చేపడితే అన్ని కోర్టులు ఒకేచోట ఉండి.. న్యాయవాదులు, కక్షిదారులకు అనుకూలంగా ఉంటుంది. – కోట జ్ఞానేష్, న్యాయవాది, మధిర

సౌర్లు వస్తున్నారని..

- సత్తుపల్లి గనుల పరిధిలో పర్యావరణ అధికారుల పరిశీలన
- దుమ్ము, దూళి లేవకుండా కప్పిపుచ్చిన యంత్రాంగం



అంబేద్కర్‌నగర్‌లో పరిశీలిస్తున్న అధికారులు



రోడ్డుపై ట్యాంకర్లతో నీళ్లు చల్లిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, సీహెచ్‌పీల కారణంగా దుమ్ముదూళి లేచి పర్యావరణం దెబ్బతింటోందని, స్థానికులు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఇటీవల సమస్యను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అసెంబ్లీలో లేవదీశారు. అయినా సింగరేణి యాజమాన్యం తాత్కాలిక చర్యలు తీసుకుంటుండడం విమర్శలకు తావిస్తోంది.

తప్పు కప్పిపుచ్చుకునేందుకు...

సింగరేణి పర్యావరణ శాఖ అధికారులు మంగళవారం ఈ ప్రాంతంలో తనిఖీకి వస్తున్నారని సమాచారం అందింది. దీంతో సింగరేణి యంత్రాంగం ఆగమేఘాలపై కిష్టారం ఓసీ నుంచి సీఎస్పీ వరకు రోడ్లను శుభ్రం చేయించడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీళ్లు చల్లించింది. సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలు మాత్రం సమస్య తీవ్రతను మానవతా దృష్టితో శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

పర్యావరణ అధికారుల తనిఖీలు

కిష్టారం ఓసీ, జేవీఆర్ ఓసీ కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్, కిష్టారం అంబేద్కర్‌నగర్ ప్రాంతాల్లో పర్యావరణ ఇంజనీర్ బి.రవీందర్ బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా కాలుష్యంపై స్థానికులు ఫిర్యాదు చేయగా... దుమ్ముదూళి లేవకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అలాగే, రోడ్డుపై నీళ్లు చల్లించకుండా స్వీపింగ్ యంత్రాల ద్వారా బొగ్గు పెళ్లలు, దుమ్మూదూళి తొలగించాలన్నారు. అనంతరం కాలుష్య తీవ్రతను గుర్తించే యంత్రాలను కొన్ని ఇళ్లపై ఏర్పాటుచేయించి, యాజమాన్యం సరైన చర్యలు తీసుకోక పోతే చట్టప్రకారం వ్యవహరించాల్సి వస్తుందని తెలిపారు. కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు, అధికారులు కోటిరెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ పరిష్కరించిన కేసులో రూ.1.75 కోట్ల పరిహారం



జిల్లా జడ్జికి చెక్కు అందజేస్తున్న న్యాయవాది

ఖమ్మంలీగల్: ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించిన మోటారు వాహన ప్రమాదం కేసులో నష్టపరిహారం కింద రూ.1.75 కోట్ల చెక్కును బీమా కంపెనీ న్యాయవాది బండారుపల్లి గంగాధర్ మంగళవారం ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్.జగ్జీవన్‌కుమార్‌కు అందజేశారు. కేసు వివరాలిలా ఉన్నాయి. పాల్వంచ థర్మల్ పవర్ స్టేషన్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అభినందన స్రవంతి 2019లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయమై రాయల్ సుందరం బీమా కంపెనీ నుంచి పరిహారం కోరుతూ కుటుంబీకులు న్యాయవాది మందడపు శ్రీనివాసరావు ద్వారా కోర్టులో కేసు దాఖలు చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఈ కేసు పరిష్కారానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్ చొరవ చూపగా ఇరుపక్షాల వారు అంగీకరించారు. దీంతో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రాంప్రసాదరావు రూ.1.75 కోట్లకు అవార్డు జారీ చేశారు. ఈ మేరకు బీమా కంపెనీ న్యాయవాది మంగళవారం చెక్కు రూపంలో జిల్లా జడ్జికి అందజేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కష్టించి పనిచేయాలి

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

ఖమ్మంవన్‌టౌన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలంతా కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి పాటుపడాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు సూచించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని అంశంతో వాటి వైఫల్యాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అలాగే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడమే కాక సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నారనే విషయాన్ని ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించి, రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు అహర్నిశలు పాటుపడాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, దేవీప్రసన్న, నాయకులు ఆదిత, పగడాల మంజుల తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశం కొనసాగుతుండగా కొందరు మహిళలు వచ్చి తమకు సమావేశంపై సమాచారం ఇవ్వలేదని అడగగా, ఎప్పుడు కాంగ్రెస్‌లో చేరారని సౌజన్య ప్రశ్నించడంతో కాసేపు వాగ్వాదం జరిగింది.

హాస్టళ్లలో వసూళ్లకు పాల్పడిన ఐదుగురి రిమాండ్

కామేపల్లి: ఐహెచ్‌ఆర్‌సీ ప్రెసిడెంట్ పేరిట ప్రభుత్వ హాస్టళ్లలో తనిఖీ చేస్తూ వార్డెన్లు, హెచ్ఎంలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఐదుగురి ముఠాను కామేపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కామేపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఐహెచ్‌ఆర్‌సీ ప్రెసిడెంట్‌నని చెబుతూ జర్పుల స్రవంతితో పాటు భూక్యా వెంకటేశ్వర్లు, మర్రికంటి శేఖర్‌మాదిగ, షేక్ ఫరీద్, భూక్యా రెడ్యా సోమవారం వెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో వార్డెన్ వసంత ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



బహుమతులు అందిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు. ఖమ్మంలోని సైన్స్ మ్యూజియం ఆవరణలో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్ఎస్‌టీ), తెలంగాణ బయాలజీ సైన్స్‌ఫోరం(టీబీఎస్ఎఫ్) ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీఈఓ మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల ఆధ్వర్యాన ఒకే టాలెంట్ టెస్ట్ నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంఓ కె.రవికుమార్, డీసీఈబీ కార్యదర్శి నారాయణరావు, టీబీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పెసర ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల ఐలయ్య, జిల్లా సైన్స్ ఆఫీసర్ జగదీశ్వర్‌తో పాటు రచ్చ శ్రీనివాస్, ఆదిత్య, ఇనుముల వెంకటేశ్వర్లు, డాన్ బాస్కో, రంజిత్, చంద్రశేఖర్, ఊటుకూరు శ్రీనివాస్, రంగనాథ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉండండి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషిచేద్దామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలో మంగళవారం ఆయన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈమేరకు ప్రజాప్రతినిధులు ప్రజల మధ్యలో ఉంటూ కార్యకర్తలకు మద్దతుగా నిలబడాలని సూచించారు. బీఆర్‌ఎస్‌కు త్వరలో మంచి రోజులు రానున్నందున ఎవరూ ఆందోళన చెందొద్దని తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం, నాయకులు గుండాల కృష్ణ, కర్నాటి కృష్ణ, మెంతుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు రైల్వేలైన్ ఎంతవరకొచ్చింది?

అశ్వారావుపేట: కొవ్వూరు, భద్రాచలంరోడ్ రైల్వే లైన్ ప్రతిపాదన, పురోగతి ఎంతవరకొచ్చిందని అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన న్యాయవాది జూపల్లి కోదండవెంకటరామారావు సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేశారు. దీనికి రైల్వే అధికారులు ఇచ్చిన సమాధానాన్ని ఆయన 'సాక్షి'కి అందజేశారు. ఈ నెల 4న ఆన్‌లైన్‌లో రామారావు దరఖాస్తును స్వీకరించిన రైల్వే అధికారులు 14న సమాధానాన్ని అందించారు. 50–50 శాతం ప్రాతిపదికన ప్రాజెక్టును నిర్మించేందుకు 2023 ఏప్రిల్ 27 ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు రైల్వే శాఖ ప్రతిపాదన పంపగా ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. తిరిగి పూర్తి భారాన్ని రైల్వే శాఖ భరించేలా రూ.2867.99 కోట్ల ప్రతిపాదనను రైల్వేశాఖకు పంపించగా మంజూరు కోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. రైల్వే శాఖ ఆమోదిస్తే నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

మల్టీపర్పస్ వర్కర్‌పై కేసు నమోదు

పెనుబల్లి: మండలంలని మండాలపాడు గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న తడికమళ్ల మన్మధరావుపై పంచాయతీ కార్యదర్శి కామిశెట్టి నర్సింహారావు ఫిర్యాదు మేరకు వీఎం బంజర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పంచాయతీ కార్యదర్శి సోమవారం ఉదయం విధులు నిర్వర్తిస్తుండగా, మన్మధరావు వచ్చి దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించడమే కాక కార్యదర్శి ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాడు. ఈఘటనపై నర్సింహారావు చేసిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండల పరిషత్ కార్యాలయం, ఎల్ఐసీ కార్యాలయం వెనుక ఉన్న అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు చెందిన జామాయిల్ తోటలో మంగళవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుమారు ఐదు హెక్టార్ల అడవిలో చెట్ల కింద పోగైన చెత్త కాలిపోయింది. గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్లు తాగి ఆర్పకుండా పడవేయడంతో ఎండిన ఆకులకు మంట అంటుకుని వ్యాపించి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. కాగా, సత్తుపల్లి నుంచి ఫైరింజన్‌తో చేరుకున్న సిబ్బంది మంటలు విస్తరించకుండా ఆర్పివేశారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి

-- కోతులను అదిలించే క్రమంలో ప్రమాదం

తిరుమలాయపాలెం: ఇంట్లోకి వస్తున్న కోతులను అదిలించే క్రమాన విద్యుత్ షాక్‌కు గురైన ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొక్కిరేణిలో మంగళవారం చోటుచేసుకుంది. కొక్కిరేణి గ్రామానికి చెందిన గద్దల గోపయ్య (79) రేకుల ఇంట్లో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లోకి కోతులు పెద్దసంఖ్యలో వస్తుండగా, వాటిని అదిలించబోయి విద్యుత్ తీగను తాకగా షాక్‌కు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు గోపయ్యను ప్రభుత్వాస్పత్రికి తీసుకవెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య వెంకటమ్మ, కుమారుడు చంద్రశేఖర్ ఉండగా, వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు - ద్విచక్రవాహనం ఢీ

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెం వద్ద మంగళవారం రాత్రి కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారు గాయపడ్డారు. ఈ రహదారిలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టగా, ఇద్దరు గాయపడినట్లు తెలిసింది. దీంతో క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించగా, బాధితులు ఎక్కడి వారో తెలియరాలేదు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని అనిశెట్టిపల్లి వాగు నుంచి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా ఎస్ఐ రమణారెడ్డి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, బుధవారం రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని ఎస్ఐ వివరించారు. కాగా, లక్ష్మీదేవిపల్లి మండలంలో అటవీశాఖ అధికారులు ఇసుక రవాణా చేస్తున్న లారీని మంగళవారం పట్టుకున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాళాలు

యజమానులు ఉండడం లేదని చర్యలు



ఓ ప్లాట్‌కు ఉన్న తాళంపై అధికారులు వేసిన రెండో తాళం

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం సముదాయంలో కొన్ని ఇళ్లకు అధికారులు మంగళవారం తాళాలు వేశారు. ఈ సముదాయంలో చాలా వరకు ఇళ్లలో ఎవరూ నివాసం ఉండడం లేదనే ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు తనిఖీ చేపట్టి ఎవరూ నివాసం ఉండని ఇళ్లపై నోటీసులు అంటించి అప్పటికే ఉన్న తాళంపై మరో తాళం వేశారు. ఇక్కడ 216 ఇళ్లలో 166 ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయించారు. అయితే, లబ్ధిదారులు పలువురు తాళం వేసి ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారని, ఇంకొందరు అద్దెకు ఇచ్చినట్లు ఫిర్యాదులు అందగా, అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు నెలలుగా తాళం వేసి ఉన్న ప్లాట్లకు రెండో తాళం వేసినట్లు తెలుస్తోంది. కాగా, తాము పనులపై బయటకు వెళ్లిన సమయాన తాళాలు వేశారని కొందరు వాపోతుండగా, అధికారులను ఆశ్రయించారు. ప్లాట్లు దక్కించుకున్న కొందరు ఇతరులకు అమ్మినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యాన అధికారులు ఆరు నెలలకో సారి తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల వైఎస్సార్ నగర్‌లో 12, పువ్వాడ నగర్‌లో 16 ప్లాట్ల యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేయగా, తామే ఉంటున్నామని చెబుతూ వారు సమాధానమిచ్చారు. ఇదే విషయమై రఘునాథపాలెం తహసీల్దార్ లూథర్ విల్సన్‌ను వివరణ కోరగా ప్లాట్ల ను లబ్ధిదారులు వినియోగించుకోవాలే తప్ప ఇతరుల కు అప్పగిస్తే అర్హత కోల్పోతారని స్పష్టం చేశారు. ఎవరికైనా ప్లాట్ అవసరం లేకపోతే ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలని సూచించారు. కాగా, లబ్ధిదారులే ఉంటున్నా తాళాలు వేసి నోటీసులు ఇవ్వడం గర్హనీయమని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చేపల కోసం అర్ధరాత్రి హల్‌చల్

నేలకొండపల్లి: గుట్టుచప్పుడు కాకుండా చేపలు తీసుకెళ్లేందుకు అర్ధరాత్రి వేళ వచ్చిన పలువురు యువకులు హల్‌చల్ చేస్తూ టిప్పర్ డ్రైవర్‌ను భయభ్రాంతులకు గురిచేసిన ఘటన ఇది. నేలకొండపల్లి మండలం చెరువుమాధారం చెరువులో మూడు రోజులుగా చేపల వేట సాగిస్తుండగా, లీజ్‌కు తీసుకున్న వ్యాపారి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాడు. అయితే, చెరువుమాధారం, మంగాపురం తండా తదితర గ్రామాల యువకులు మాత్రం ఇక్కడే విక్రయించాలని ఘర్షణ పడుతున్నారు. ఈనేపథ్యాన సోమవారం అర్ధరాత్రి కొందరు యువకులు చేపల లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను బుద్ధారం శివార్లలో అడ్డుపడి డ్రైవర్‌తో ఘర్షణకు దిగారు. డ్రైవర్‌ను బెదిరించి దాదాపు ఐదు బస్తాల చేపలను తీసుకుని పారిపోయారు. దీంతో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో సొసైటీ నిర్వాహకులు, పోలీసుల సాయంతో వచ్చేసరికి ఇద్దరు చిక్కారు. ఈసందర్భంగా సొసైటీ నిర్వాహకులు మాట్లాడుతూ ఇతర గ్రామాల నుంచి వచ్చిన వారు చెరువును లూటీ చేయాలని చూస్తున్నందున పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఘటనలో మంగళవారం రాత్రి నేలకొండపల్లి పోలీసుల ఆధ్వర్యాన టమకా వేయించారు. ఇతరులు చెరువులోకి దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలతో వస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.